ANDHRAJYOTHY


ఆంధ్రజ్యోతి

5

శ్రీకాకుళం

జిల్లా వార్తలు

శనివారం 10 ఫిబ్రవరి 2024





ఇచ్ఛాపురం : వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు

గంజాయి రవాణాలో ఇంటి దొంగలు

- ఇద్దరు ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్ల అరెస్టు
- ముఠాకు సహకరించినట్లు నిర్ధారణ
- రూ.20వేలు ఇవ్వాలని డిమాండ్
- 72 కేజీల నిల్వలు స్వాధీనం

గంజాయి ముఠాలకు ఆర్పీఎఫ్‌లో కొందరు ఇంటిదొంగలు సహకరిస్తున్నారు. దొరికితేనే దొంగలు.. అన్నచందంగా తయారైంది. గంజాయి దొరికితే అంతో ఇంతో డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇచ్ఛాపురంలో ఇద్దరు కానిస్టేబుళ్లు డబ్బులు తీసుకుని గంజాయి ముఠాకు సహకరించారు. పోలీసులు ఆ ఇద్దరినీ అరెస్టు చేశారు. పలాసలో కూడా 2012లో ఆర్పీఎఫ్ ఎస్ఐ స్థాయి అధికారి పట్టుబడ్డారు.

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 9: గంజాయి ముఠా ఇచ్ఛాపురం పోలీసులకు పట్టుబడింది. ఒడిశా రాష్ట్రం బరంపురం నుంచి ఇచ్ఛాపురం మీదుగా రైలులో గంజాయిని పూణే తరలించేందుకు ముగ్గురు ముఠా సభ్యులు సిద్ధమయ్యారు. వారి దగ్గర మామూళ్లు తీసుకుని.. వారికి ఇద్దరు రైల్వే కానిస్టేబుళ్ల సహకరించారు. పోలీసులు సమాచారం తెలుసుకుని మొత్తం ఐదుగురినీ అరెస్టు చేశారు. బ్యాగుల్లో ఉన్న 72 కేజీల గంజాయి నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం సర్కిల్ కార్యాలయంలో సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. 'ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా రయాగడ బ్లాక్ పర్లాకిమిడికు చెందిన ఉత్తర గౌడో (30), కుషా బుయాన్ (19), రంజు గమాంగో (21) గంజాయి ముఠాను ఈ నెల 7న పట్టుకున్నాం. ఈ ముఠాకు సహకరించిన ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్ల గంజాం జిల్లా చీకటి బ్లాక్ సువాని గ్రామానికి చెందిన జుదిష్టి బెహరా, వినోద్‌బెహరాలను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాం. మరో మహిళ పింకి పరారైంది. ఈ నెల 7న ముఠా సభ్యులు ఉత్తర గౌడో, కుషా బుయాన్, రంజు గమాంగో బరంపురంలో కొనుగోలు చేసిన 72 కేజీల గంజాయిని.. నాలుగు సూట్‌కేసులు, బ్యాగుల్లో అమర్చారు. ప్రయాణికుల మాదిరి వాటితో కారులో ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. ఆదేరోజు సాయంత్రం భువనేశ్వర్- ముంబై కోణార్క్ రైలులో వెళ్లేందుకు సిద్ధమయ్యారు. వారి దగ్గర సూట్‌కేసులు, బ్యాగులు చూసి ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు జుదిష్టి బెహరా, వినోద్‌బెహరాకు అనుమానం వచ్చి ఆరా తీశారు. అందులో గంజాయి ఉన్నట్టు గుర్తించామని.. తమకు రూ.20 వేలు ఇస్తే వదిలేస్తామని, లేదంటే కేసులు పెడతామని బెదిరించారు. దీంతో ముఠా సభ్యులు తమ వద్ద రూ.5వేలు ఉన్నాయని చెప్పారు. కాగా.. మొత్తం డబ్బులు ఇవ్వాలని కానిస్టేబుళ్లు డిమాండ్ చేశారు. దీంతో వారంతా రైల్వేస్టేషన్‌కు సమీపంలో ఉన్న చిదంబరేశ్వర ఆలయం వద్ద చెట్టు దగ్గరకు చేరుకున్నారు. డబ్బులు ఇస్తారా? ఇవ్వరా? అని కానిస్టేబుళ్లు అడగ్గా.. తమ వద్ద లేవని, ఫోన్‌పే నెంబర్ చెబితే తమ వాళ్లతో డబ్బులు వేయిస్తామని ముఠా సభ్యులు తెలిపారు. మీ అకౌంట్‌లో వేసుకుని.. ఏటీఎం ద్వారా డబ్బులు తీసి ఇవ్వాలని కానిస్టేబుళ్లు తెలిపారు. ఈ క్రమంలో ముఠా సభ్యుల్లో ఒకరైన రంజు గుమాంగో కానిస్టేబుళ్లతో కలిసి ఏటీఎం వద్దకు వెళ్లి రూ.10 వేలు తీసి ఇచ్చారు. మళ్లీ ఏటీఎంలో డబ్బులు రాకపోవడంతో మరో చోటుకు వెళ్లారు. అక్కడ ఇంకో రూ.8వేలు ఫోన్ పే చేశారు. తర్వాత చిదంబరేశ్వర ఆలయంలోని చెట్టు వద్దకు చేరుకున్నారు. అప్పటికే ట్రైన్ వెళ్లిపోయింది. ముఠాను చూసిన కొందరు అనుమానంతో ఎస్సై సత్యనారాయణకు సమాచారం ఇచ్చారు. దీంతో సిబ్బందితో కలిసి దాడులు చేశారు. ఉత్తర గౌడో, కుషా బుయాన్, రంజు గమాంగో వద్ద గంజాయి నిల్వలు ఉన్నట్టు గుర్తించి వాటిని స్వాధీనం చేశారు. ఆ ముగ్గురినీ అదుపులోకి తీసుకుని విచారించగా.. వారి నుంచి డబ్బులు తీసుకుని ఇద్దరు ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్ల సహకరించినట్టు తేలింది. దీంతో ఆ ఐదుగురినీ అరెస్టు చేశామ'ని ఇమ్మాన్యుయేల్ రాజు తెలిపారు. పూర్తిస్థాయిలో గస్తీ పెంచి.. గంజాయి అక్రమ రవాణా నియంత్రిస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సై సత్యనారాయణ, రూరల్ ఎస్సై లక్ష్మణ్, కవిటి ఎస్సై రాము పాల్గొన్నారు.





..వయా పలాస

- విచ్చలవిడిగా గంజాయి రవాణా
- ప్రధానంగా ఒడిశా నుంచి రాక
- ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు..
- వారంలో 200 కిలోల పట్టివేత
- సరఫరాదారులే చిక్కుతున్నవైనం
- సూత్రధారులైన వ్యాపారులు ఎక్కడ?

- గతేడాది పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ పరిధి లక్ష్మీపురం టోల్‌గేటు వద్ద ఒడిశా నుంచి ఆయిల్ ట్యాంకు వస్తుండగా అనుమానంతో కాశీబుగ్గ పోలీసులు సోదాలు చేశారు. ట్యాంకులో పెట్రోలుకు బదులు టన్నున్నరకు పైగా గంజాయి ఉండడంతో నివ్వెరపోయారు.
- కొన్నాళ్ల కిందట లక్ష్మీపురం టోల్‌గేట్ వద్ద కాశీబుగ్గ పోలీసులు.. ఖాళీగా వెళ్తున్న ఒడిశాకు చెందిన ఒక లగేజీ వ్యాన్‌ను తనిఖీ చేశారు. వ్యాన్ కింద భాగంలో చూడగా.. ప్రత్యేకంగా ఓ అర కనిపించింది. అది తెరిచి చూడగా.. అందులో 200 కిలోలకుపైగా గంజాయి పట్టుబడింది.
- తాజాగా వారం రోజుల వ్యవధిలో ఇచ్ఛాపురం, మందస, కాశీబుగ్గ పోలీసులు, పలాస రైల్వే పోలీసులు సాధారణ తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో వివిధ మార్గాల ద్వారా రవాణా చేస్తున్న గంజాయి పట్టుబడుతూనే ఉన్నాయి.

(పలాస)

జిల్లాలో గంజాయి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ప్రధానంగా పలాస కేంద్ర బిందువుగా ప్రయాణికుల బ్యాగుల్లో ఇతర ప్రాంతాలకు తరలిపోతోంది. పోలీసుల తనిఖీల్లో వారం రోజుల వ్యవధిలో 200 కిలోలకుపైగా గంజాయి నిల్వలు పట్టుబడడం చర్చనీయాంశమవుతోంది. లగేజీ బ్యాగులు కనిపిస్తే చాలు.. అందులో గంజాయి కచ్చితంగా ఉంటుందనే నమ్మకం పోలీసుల్లో ఏర్పడింది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. పోలీసులు తనిఖీలు ముమ్మరం చేయడంతో అధికంగా గంజాయి రవాణాదారులు పట్టుబడుతున్నారు. కాగా.. పట్టుబడిన వారంతా కేవలం రోజువారి కూలీలు, బ్రోకర్లు మాత్రమే. గంజాయిని పండించే రైతులు కానీ, విక్రయదారులు కానీ పోలీసులకు పట్టుబడకపోవడం గమనార్హం.

● గిరిజనులే పావులుగా..

ఆంధ్రా-ఒడిశా బోర్డరు మల్కన్‌గిరి, ఆర్.ఉదయగిరి, మోహన, గజపతి బ్లాకుల్లో ఉన్న మారుమూల కొండలు, అటవీ ప్రాంతాల్లో గంజాయిని విరివిగా పండిస్తున్నారు. గిరిజనులను పావులుగా వినియోగించుకొని.. వారికి ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకూ బయానా ఇస్తు పండిస్తున్నారు. పంట పండిన తరువాత రైతుల నుంచి బ్రోకర్లు ఒడిశా బోర్డరు వరకూ తీసుకువచ్చి అక్కడ నుంచి కూలీలు, చిన్నచిన్న బ్రోకర్లుకు అప్పగిస్తారు. నిఘా లేకపోతే రైలుమార్గం, నిఘా ఎక్కువయితే రోడ్డు మార్గం గుండా గంజాయిని హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబాయి ప్రాంతాలకు తరలిస్తుంటారు. పది కిలోలకు ఒక్కో కూలీకు రూ.5వేలు నుంచి వారి చేసిన సాహసం బట్టి రూ.10వేల వరకూ ఇస్తుంటారు. అయితే తమకు ఒరిజినల్ వ్యాపారి ఎవరనేది తెలియదని, కనీసం వారి ఫోన్ నెంబర్లు కూడా అందుబాటులో ఉండవని కూలీలు చెబుతున్నారు. 'కేవలం బ్రోకర్లు ఫోన్ చేసి.. ఫలానా వ్యక్తి వేసుకున్న దుస్తుల కలర్, ఎత్తు ఆధారాలు చెప్పి సరుకు ఇవ్వాలని ఆదేశిస్తారు. ఆ ఆనవాళ్ల ప్రకారం గంజాయి నిల్వలు అందజేస్తామ'ని పేర్కొంటున్నారు.

● లాభసాటి వ్యాపారంగా..

గంజాయి రవాణా వెనుక గూఢాచార్యం దాగి ఉంది. ఇక్కడ కిలో రూ.3వేలుకు కొనుగోలు చేసిన గంజాయి రవాణా పూర్తయిన తరువాత రూ.30వేల నుంచి రూ.50వేలు పలుకుతుంటుంది. తక్కువ రిస్క్‌తో అధిక లాభాలు రావడంతో గంజాయినే వ్యాపారవస్తువుగా ఎంచుకున్నారన్నది స్పష్టమవుతోంది. ఒడిశాలో పండించిన గంజాయిని దేశ వ్యాప్తంగా రవాణా చేస్తున్న వేళ పోలీసులు మరింత నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది. మన జిల్లానుంచే కాకుండా విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖ, పాడేరు మన్యం ప్రాంతాల నుంచి కూడా ఒడిశా బోర్డరు మీదుగా రవాణా జరుగుతున్న వ్యవహారంపై పర్యవేక్షించాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై పలాస రైల్వే సీఐ వెంకటరావు వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా.. గంజాయి రవాణాదారులపై పూర్తిస్థాయిలో దృష్టి సారించామన్నారు. రైలుమార్గం నుంచి సరుకుల వెళ్లకుండా రాత్రులు కూడా నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలతో పాటు అరకు ప్రాంతం వరకూ నిఘా ఉధృతం చేశామన్నారు.



పలాసలో రెండు రోజుల కిందట ప్రయాణికుల బ్యాగులో లభించిన గంజాయి

సెబ్‌లో సిబ్బంది కొరత

● అరకొరగానే తనిఖీలు

(టెక్కలి)

జిల్లాలో గంజాయి రవాణా యథేచ్ఛగా సాగుతున్నా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. సిబ్బంది కొరత కారణంగా అరకొరగానే తనిఖీలు చేపడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత 2020 మే 16న స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోను ఏర్పాటు చేసింది. ఎక్సైజ్ శాఖలో పనిచేసిన సిబ్బందిని 30:70 నిష్పత్తిన విభజించి విధులు కేటాయించింది. జిల్లాలో మొత్తం 12 స్టేషన్లను ఏర్పాటుచేసింది. అయితే ఒక్క స్టేషన్‌కు కూడా సొంత భవనం లేదు. 15 మంది ఎస్ఐలకుగాను 10 మంది మాత్రమే ఉన్నారు. హెచ్‌సీలు 186 మందికిగాను 110 మంది మాత్రమే కొనసాగుతున్నారు. కానిస్టేబుళ్లు సైతం అరకొరగానే ఉన్నారు. దీంతో ఉన్న సిబ్బందిపై పనిభారం పెరుగుతోంది. అరకొరగానే తనిఖీలతో నేర నియంత్రణ సాధ్యం కావడం లేదు. జిల్లాలో మొత్తం నమోదైన నేరాల్లో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నేరాలదే సింహ భాగం అవుతోంది.

యువతే టార్గెట్

యువకులు, విద్యార్థులే గంజాయి ముఠా టార్గెట్. ఇందుకు ప్రత్యేకంగా గ్రామంలో ఐదారుగురు యువకులను ఎంపిక చేసి వాట్సాప్ గ్రూపులు నడుపుతున్నారు. ఫలానా చోట గంజాయి దొరకుతుందని యువకులకు కోడ్ సంభాషణ ద్వారా చెబుతున్నారు. వారిని గంజాయికి బానిసలు మార్చుతూ వ్యాపారం సాగిస్తున్నారు. మరోవైపు ఒడిశా సరిహద్దున జిల్లా ఆనుకుని ఉండడంతో మాదకద్రవ్యాల రవాణా, వినియోగం, విక్రయానికి కారణమవుతోంది. ఒడిశాలోని గజపతి, గంజాం, రాయగడ జిల్లాలకు సంబంధించి అంతర్‌రాష్ట్ర రహదారులు ఉన్నాయి. ఈ రోడ్లలో కనీస తనిఖీలు లేవు. చెక్‌పోస్టులను సైతం ఎత్తేశారు. ప్రత్యేక పోలీసులను విధుల నుంచి తొలగించారు. దీంతో తనిఖీలు మృగ్యమయ్యాయి. దీంతో గంజాయి రవాణా యథేచ్ఛగా సాగుతోంది.

నిఘా పెట్టాం

జిల్లా అంతటా నిఘా పెట్టాం. వసుంధర, పురుషోత్తపురం చెక్‌పోస్టులతో పాటు బోర్డర్ మొబైల్ పార్టీలు ఏర్పాటు చేశాం. ఒడిశా బోర్డర్ కావడంతో ఆంధ్రా మీదుగా రైళ్లలో ఇతర రాష్ట్రాలకు కొంతమంది తరలిస్తున్నారు. ఆర్‌పీఎఫ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, పోలీస్ విభాగాలు గంజాయి అక్రమ రవాణా నియంత్రణపై నిఘా ఉంచాయి.

-ప్రేమ కాజోల్, సెబ్ జాయింట్ డైరెక్టర్

2012లో ఎస్ఐ స్థాయి అధికారి..

పలాస: 2012 అక్టోబరు 3న.. పలాస ఆర్పీఎఫ్ ఎస్ఐ స్థాయి అధికారి సుమారు 200 కిలోలకుపైగా గంజాయి రవాణాకు సిద్ధమవ్వగా కాశీబుగ్గ పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా ఆయనను పట్టుకున్నారు. ఈ కేసులో మరో ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ పరారీ కాగా.. ఆయనను సైతం పట్టుకుని న్యాయస్థానంలో నిలబెట్టారు. ఈ కేసుపై రైల్వే విజిలెన్స్ సీఐ జెన్నా నేతృత్వంలో అప్పట్లో దర్యాప్తు చేసి అక్రమాలకు పాల్పడిన ఎస్ఐ, కానిస్టేబుల్‌ను విధుల నుంచి తాత్కాలికంగా తొలగించారు. పలాస రైల్వేస్టేషన్‌ను ఆనుకుని బ్యారెక్స్ అప్పట్లో ఉండేది. ప్రస్తుతం ఆ ప్రాంతం రైల్వే సిబ్బంది పార్కింగ్ స్థలంగా వినియోగిస్తున్నారు. ఇందులోనే ఎస్ఐ నివాసం ఉంటూ ఎవరికీ అనుమానం రాకుండా ఒకరిద్దరు సిబ్బంది సహకారంతో రైల్వే లైసెన్స్ కూలీల ద్వారా రైలు నుంచి నేరుగా బ్యారెక్స్‌లోకి గంజాయి తీసుకువచ్చేవాడు. అక్కడ నుంచి కిలోల చొప్పున ప్యాకెట్లు చేసి మళ్లీ తిరిగి రైలులో హైదరాబాద్, బెంగళూరు తరలించేవాడు. ఈ వ్యవహారంపై రైల్వే పోలీసులు నిఘా పెట్టి కాశీబుగ్గ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బండారం మొత్తం బయట పడింది.



బ్యారెక్స్‌లో గంజాయి నిల్వలతో పోలీసులకు పట్టుబడిన ఆర్పీఎఫ్ ఎస్ఐ సుమంతో (ఫైల్)

మొరాయించిన రైల్వే లిఫ్ట్

● ప్రయాణికులకు ఇబ్బందులు

ఆమదాలవలస, ఫిబ్రవరి 9: ఆమదాలవలస (శ్రీకాకుళం రోడ్డు) రైల్వేస్టేషన్‌లోని లిఫ్ట్ మొరాయించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రైల్వేస్టేషన్ ఆరు బయట నుంచి ఫ్లాట్‌ఫారానికి వెళ్లేందుకు ప్రయాణికులు లిఫ్ట్ ఎక్కారు. శుక్రవారం ఉదయం 9.40 గంటల నుంచి 10.15 గంటల వరకు విద్యుత్ సరఫరా అంతరాయంతో లిఫ్ట్ మధ్యలో ఆగిపోయింది. దీంతో అందులో చిన్నారులతో సహా ఉండిపోయిన మహిళలు, ప్రయాణికులు ఆందోళన చెందారు. చుట్టుపక్కల ఉన్నవారంతా ఆ ప్రాంతానికి చేరుకుని రైల్వే అధికారులకు సమాచారం అందించారు. రైల్వేఅధికారులు, ఆర్పీఎఫ్ పోలీసులు అక్కడకు చేరుకుని విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.

నడిరోడ్డుపై విద్యార్థుల కొట్లాట

సరుబుజ్జిలి, ఫిబ్రవరి 9: సరుబుజ్జిలిలో నడిరోడ్డుపై ఇంటర్ విద్యార్థులు కొట్లాడుకున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థులు పలు రకాల మనస్పర్థలతో రెండు గ్రూప్‌లుగా విడిపోయారు. నాలుగు రోజులుగా కళాశాల నుంచి సాయంత్రం వస్తున్న వేళ.. బస్‌స్టేషన్ వద్ద గొడవ పడుతున్నారు. శుక్రవారం కూడా సరుబుజ్జిలి ప్రధాన రహదారిపై విద్యార్థులు ఒక్కసారిగా కేకలు వేసుకుంటూ పరస్పర దాడులు చేసుకున్నారు. స్థానికులు భయాందోళన చెందుతూ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ నిహార్ సిబ్బందితో అక్కడకు చేరుకోగా.. విద్యార్థులు పరుగులు పెట్టారు.



వాగ్వాదం చేసుకుంటున్న విద్యార్థులు

రైతుల ప్రయోజనమే లక్ష్యం

● కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్



మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, ఫిబ్రవరి 9: రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా వ్యవసాయ సలహా మండలి నిర్ణయాలు ఉండాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జేసీ నవీన్‌తో కలిసిజిల్లా వ్యవసాయ సలహామండలి, దాని అనుబంధ శాఖలు, జలవనరుల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నిర్దేశించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతి, కిసాన్ క్రెడిట్ కార్డులు, ఉచిత విద్యుత్తు, స్మార్ట్ మీటర్లు, ఇన్‌పుట్ సబ్సిడీ, పశుబీమా, మట్టి నమూనా, తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. 'జిల్లాలో 70శాతం ప్రజలు వ్యవసాయం దాని అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారు. రైతు ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యమివ్వాలి. వ్యవసాయ అనుబంధ శాఖలన్నీ సమన్వయంతో సమిష్టిగా పనిచేయాలి. రైతుభరోసా కేంద్రాల ద్వారా అన్నదాతలకు లబ్ధి చేకూరాలి' అని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు, బిల్లుల చెల్లింపు రెండు వారాల్లోగా పూర్తిచేయాలని తెలిపారు. సమావేశంలో వంశధారపై సుదీర్ఘ చర్చ సాగింది. ప్రాజెక్టు స్థితిగతులపై కలెక్టర్‌కు ఎస్ఈ డోల తిరుమల రావు వివరించారు. జిల్లా వ్యవసాయాధికారి కె.శ్రీధర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ రాఘ వేంద్ర మీనా, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ శిమ్మ నేతాజీ, నీటి పారుదల శాఖ ఎస్ఈ సుధాకరరావు, పశు సంవర్ధకశాఖ జేడీ కిషోర్, మత్స్యశాఖ డీడీ శ్రీనివాసరావు, మార్క్‌ఫెడ్ డీఎం రమణి, సెరీకల్చర్ అధికారి రాజేంద్ర ప్రసాద్‌బాబు, ఉద్యానవన అధికారి ప్రసాదరావు, మార్కెటింగ్ ఏడీ గంగాధర్, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

భక్తుల సౌకర్యాలకే ప్రాధాన్యం

● ఆర్డీవో రంగయ్య ● రథసప్తమి ఏర్పాట్లపై సమీక్ష

అరసవల్లి, ఫిబ్రవరి 9: అరసవల్లిలోని రథసప్తమి ఉత్సవాల్లో భక్తుల సౌకర్యాలకే తొలి ప్రాధాన్యమివ్వాలని శ్రీకాకుళం ఆర్డీవో సీహెచ్ రంగయ్య సూచించారు. శుక్రవారం సూర్యనారాయణ స్వామివారి ఆలయ అనివెట్టి మండపంలో ఆలయ ఈవో రమేష్‌బాబు అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో రథసప్తమి ఏర్పాట్లపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. 'మెడికల్ క్యాంపుల ఏర్పాటు, నిరంతర విద్యుత్తు ఉండేలా చర్యలు తీసుకోవాలి. దివ్యాంగులు, వృద్ధులు కోసం వీల్ ఛైర్స్ ఏర్పాటు చేయాలి. సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించాలి. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో రెవెన్యూ, దేవదాయ శాఖ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. 80 అడుగుల రోడ్డులో వాహనాల పార్కింగ్‌కు చర్యలు చేపట్టాలి' అని తెలిపారు. గత ఈవో హరిసూర్యప్రకాష్ మాట్లాడుతూ.. 'స్వామి దర్శనానికి వచ్చే ఉచిత, వంద రూపాయల ప్రవేశ దర్శన మార్గాలను కార్పొరేషన్ ఉన్నత పాఠశాల, అరసవల్లి నుంచి ప్రారంభమవుతాయి. ఇంద్ర పుష్కరిణి ఆగ్నేయ ద్వారం ద్వారా ఉచిత దర్శనానికి, ఈశాన్య ద్వారం ద్వారా రూ.100ల ప్రత్యేక ప్రవేశ దర్శనం ఉంటుంది. అలాగే సింహ ద్వారం నుంచి వీవీఐపీ రాకపోకలకు ప్రత్యేక మార్గం, బొంపాడ వీధి నుంచి దాతలకు, క్షీరాభిషేకం రూ.500లకు అర్ధరాత్రి 12.30 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు వేర్వేరుగా దర్శనం అనుమతి ఉంటుంది. అనంతరం దాతల లైన్ ద్వారా రూ.500 టిక్కెట్ (వీఐపీ) దర్శనం, క్షీరాభిషేకం లైన్ ద్వారా విశిష్ట దర్శనం రూ.500కు భక్తులకు అనుమతిస్తాం. రూ.500 టిక్కెట్లను అరసవల్లి యూనియన్ బ్యాంకు ద్వారా విక్రయిస్తాం. ఈ టిక్కెట్లను నాలుగు స్లాట్స్ ద్వారా దర్శన సమయం కేటాయిస్తామ'ని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, కొంచాడ సోమేశ్వరరావు, కోటేశ్వర చౌదరి, లుకలాపు గోవిందరావు, జలగడుగుల శ్రీనివాస్, ఎం.లక్ష్మి, ద్వారపు అనూరాధ, సీఐ ఎల్.సన్యాసినాయుడు, ఎస్ఐ బలివాడ గణేష్, ట్రాఫిక్ సీఐ అవతారం, దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్, డీఎంహెచ్‌వో బి.మీనాక్షి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో రంగయ్య

కబ్జాలకు కేరాఫ్ పొందూరు

- చెరువు గర్భాన్నీ వదలరు
- కోనేరు ఆక్రమణ యత్నం
- తాజాగా ఓ ప్రైవేటు సంస్థ కట్టడం వివాదాస్పదం



చెరువు స్థలాన్ని క్రషర్‌ఫౌడర్‌తో చదును చేసిన దృశ్యం

(పొందూరు)

అది ప్రభుత్వ స్థలం. పైగా చెరువు గర్భం. రాపాక కూడలిలో రాష్ట్ర రహదారికి ఆనుకుని ఉన్న అత్యంత విలువైన స్థలం. ఇక్కడ సెంటు రూ.20లక్షల వరకు ఉంటుంది. దీనిపై అక్రమార్కుల కన్ను పడింది. కొన్నాళ్ల కిందట ఆక్రమణకు యత్నించగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ఈ చెరువు గర్భాన్ని ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆక్రమణకు ప్రయత్నించినవారిపై పోలీసులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకున్నారు. కాగా.. తాజాగా ఈ స్థలాన్ని ఓ ప్రైవేటు సంస్థ ఆక్రమించేందుకు ప్రయత్నించడం చర్చనీయాంశమవుతోంది. వివరాల్లోకి వెళితే.. పొందూరు మండలం రాపాక కూడలిలోని సర్వేనెంబర్ 311-1లో సీతారామస్వామి కోనేరు ఉంది. ఇప్పటికే కొంతభాగం మట్టితో కప్పి ఆక్రమణకు గురైంది. 2020 మే నెలలో ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇది ప్రభుత్వ స్థలమని.. ఆక్రమిస్తే చర్యలు తప్పవని అప్పటి తహసీల్దార్ ఆర్.రంజిత్.. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అంతకుముందు పని చేసిన తహసీల్దార్ అమల.. సర్వోన్నత న్యాయస్థానం తీర్పుమేరకు ఈ చెరువు స్థలంలో ఎటువంటి పట్టాలు ఇవ్వడం జరగదని కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆక్రమణకు ప్రయత్నించినవారిపై చర్యలు తీసుకున్నారు. కాగా.. మైనింగ్ లీజు వసూలు లైసెన్స్ పొందిన ఓ ప్రైవేటు సంస్థ.. మండలంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి చెక్‌పోస్టులు ఏర్పాటు చేసింది. సెక్యూరిటీ గార్డుల కోసం గదుల నిర్మాణాలు చేపడుతోంది. ఇందులో భాగంగా 311-1 స్థలంలో కూడా సెక్యూరిటీ గార్డు గది నిర్మాణానికి ప్రయత్నించింది. కాగా, ఈ ప్రయత్నాన్ని గతంలో ఆక్రమణకు ప్రయత్నించిన వ్యక్తి తనకు ఈ స్థలం మంజూరు చేశారని, రెవెన్యూ పత్రాలు ఉన్నాయంటూ అడ్డుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా చెరువు గర్భాన్ని ఎవరికీ ఇవ్వలేదని కలెక్టర్‌కు నివేదిక సమర్పించి.. ఈ స్థలంలో బోర్డులు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు ఏమి చర్యలు తీసుకుంటారోనని స్థానికులు ఎదురుచూస్తున్నారు. చెరువుగర్భంలో ఎటువంటి పత్రాలు ఇచ్చినా న్యాయపోరాటం చేయడానికి ఇటు ప్రతిపక్షాలతోపాటు చెరువును దానం చేసిన కుటుంబ సభ్యులు సిద్ధంగా ఉన్నారు.

చెరువు గర్భంలో పట్టాలు చెల్లవు

చెరువుగర్భంలో ఎటువంటి పట్టాలు ఇవ్వడానికి ఎవరికీ అధికారంలేదు. చెరువుగర్భాలు, గెడ్డపోరంబోకులలో ఆక్రమణలు తొలగించాలని కోర్టుల ఆదేశాలు ఉన్నాయి. చెరువు గర్భాలు ఆక్రమిస్తే చర్యలు తప్పవు.

-ఎం.పాల్‌కిరణ్, తహసీల్దార్, పొందూరు

శంఖారావాన్ని విజయవంతం చేయండి

● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

పలాస, ఫిబ్రవరి 8: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఈనెల 11న పలాసలో నిర్వహించనున్న శంఖారావం కార్యక్రమానికి వస్తున్నందున, పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష కోరారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం నేతలు, కార్యకర్తలతో సమీక్షించారు. ఆరోజు హైవేపై కంబిరిగాం జంక్షన్ వద్ద భారీ బహిరంగ సభ నిర్వహించనున్నామన్నారు. రాష్ట్రంలో వైసీపీ పాలనలో ప్రజలు పడే ఇబ్బందులు వర్ణనాతీతమని, ఎప్పుడు ఎన్నికలు వస్తాయా, వైసీపీని సాగనంపుదామా అని ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. లోకేష్ చేపడుతున్న శంఖారావం యాత్రకు పెద్ద ఎత్తున ప్రజలను తీసుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు యాదవ్, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, బడ్డ నాగరాజు, పీరుకట్ల విఠల్‌రావు, నవీన్, టంకాల రవిశంకర్‌గుప్తా, జోగ మల్లి, కె.సత్యం, రామకృష్ణ, నర్సింహులు పాల్గొన్నారు.



పలాస: శంఖారావం యాత్రపై నేతలతో చర్చిస్తున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

విజయవంతం చేయండి

ఇచ్ఛాపురం: స్థానిక సురంగిరాజా మైదానంలో ఈ నెల 11న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టనున్న శంఖారావం యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. జగన్ సర్కారు అరాచక పాలనపై శంఖారావం యాత్ర చేపడుతున్నట్టు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, నేతలు హాజరు కావాలని కోరారు.

లోకేష్ శంఖారావ సభకు తరలిరండి

టెక్కలి: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఈనెల 11న సాయంత్రం 4గంటలకు టెక్కలిలో నిర్వహించనున్న ఎన్నికల శంఖారావం సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని టీడీపీ నాయ కులు కోరారు. శుక్రవారం టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి తదితరులు వివిధ గ్రామాల్లో పర్యటించి గ్రూప్, క్లస్టర్ ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలను కలిసి చర్చించారు. లోకేష్ శంఖారావం యాత్రతో వైసీపీలో వణుకు ప్రారంభమవుతుందని, రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి విజయం ఖాయమన్నారు. కార్యక్రమంలో నేతలు బసవల అప్పలస్వామి, మామిడి రాము, లవకుమార్, ప్రీతీష్‌రెడ్డి, జగదీష్, పరుడో, మెండ దమయంతి, బొరిగి వెంకట్రావు, దల్లి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టెక్కలి: సీతాపురంలో పర్యటిస్తున్న టీడీపీ నాయకులు

టెక్కలిలో ఎన్నికల శంఖారావ సభ

సంతబొమ్మాళి: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఈనెల 11న టెక్కలిలో సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తున్న ఎన్నికల శంఖారావ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జీరు భీమారావు కోరారు. శుక్రవారం వడ్డితాండ్ర, బోరుభద్రతో పాటు తీరప్రాంత గ్రామాల్లో పర్యటించి క్యాడర్‌ను సమాయత్తం చేశారు. భారీ స్థాయిలో ప్రజలను తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఐటీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అప్పిన వెంకటేష్, మండల తెలుగు యువత అధ్యక్షుడు కూశెట్టి భానుప్రకాష్, ఐటీడీపీ మండల అధ్యక్షుడు బెండి అరుణ్ కుమార్, సువ్వారి ప్రసాద్, మెండ రామినాయుడు, కర్రి విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సంతబొమ్మాళి: వడ్డితాండ్రలో పర్యటిస్తున్న టీడీపీ నాయకులు



నరసన్నపేట: సీఐ ప్రసాదరావుతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

12న శ్రీకాకుళంలో లోకేశ్ పర్యటన

గార: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఈనెల 12న శ్రీకాకుళంలో జరిగే ఎన్నికల శంఖారావం సభలో పాల్గొంటున్నారని, ఆ సభకు గార మండలం నుంచి అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం వమరవెల్లిలో నిర్వహించిన పార్టీ మండల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సమావేశంలో పార్టీ నాయకులు జల్లు రాజీవ్, రాధాకృష్ణ రెడ్డి, పి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన

నరసన్నపేట: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం సభను ఈనెల 12న జమ్ము జంక్షన్ నిర్వహిస్తున్న నేపథ్యంలో సదరు స్థలాన్ని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి తదితరులు పరిశీలించారు. లోకేశ్ సభకు భద్రత, స్టేజ్ నిర్మాణం తదితర ఏర్పాట్లపై సీఐ బి.ప్రసాదరావుతో చర్చించారు. కార్యక్రమంలో ఎస్ఐ అశోక్ బాబు, టీడీపీ నాయకులు బైరి భాస్కరరావు, బెవర రాము, గొద్దు చిట్టిబాబు పాల్గొన్నారు.



గార: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి

ఆకట్టుకున్న ప్రదర్శన



నులిపురుగు ఆకృతిలో ప్రదర్శన ఇచ్చిన కేజీబీవీ విద్యార్థినులు

పోలాకి: డీవార్మింగ్ డే సందర్భంగా శుక్రవారం గంగివలస కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులు నులిపురుగు ఆకృతిలో కూర్చొని ఆకట్టుకున్నారు. డీ వార్మింగ్ డే అనే ఆంగ్ల అక్షరాలను రూపొందించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి శారద, ఆరోగ్య విస్తర ణాధికారి నల్లి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎఫ్ పనితీరుపై ఏపీఎంకు ఫిర్యాదు

ఎల్.ఎన్.పేట: ధనుకువాడ గ్రామానికి చెందిన వెలుగు సీఎఫ్ బి.హేమలతపై అదే గ్రామానికి చెందిన కనకదుర్గమ్మ మహిళా స్వయంశక్తి సంఘం ఆర్గనైజర్, సబ్ ఆర్గనైజర్‌లు ఎం.సావిత్రి, టి.లక్ష్మి శుక్రవారం వెలుగు ఏపీఎం రవిరాజ్‌కు ఫిర్యాదుచేశారు. గ్రూపు సభ్యురాలు కె.చిన్నమ్మడు గతంలో స్త్రీనిధి ద్వారా రూ.50 వేలు రుణం తీసుకొని చెల్లించకపోవడంతో గ్రూపు సభ్యుల పొదుపులో ఉన్న మొత్తం నుంచి గత ఏడాది అక్టోబరు 11న తీసి రూ.28 వేలను బ్యాంకులో చెల్లించిందని గ్రూపు లీడర్లు తెలిపారు. మా అనుమతి లేకుండా ఎలా పొదుపు నుంచి సీఎఫ్‌కు ఇచ్చారని ఏపీజీవీబీకి వెళ్లి మేనేజర్‌ను అడిగామని, అయితే సభ్యుల తీర్మానం మేరకే ఇచ్చామంటూ ఆ తీర్మానాన్ని చూపించారన్నారు. దీంతో సీఎఫ్ హేమలతను గ్రూపు లీడర్లు నిలదీశారు. వైఎస్ఆర్ ఆసరా, రుణాల వడ్డీ మాఫీ అంటూ మాయమాటలు చెప్పి సభ్యులతో తీర్మానాలపై సీఎఫ్ సంతకాలు చేయించిందని గ్రూపు లీడర్లు వాపోయారు. దీనిపై విచారణ చేసి న్యాయం చేయాలని వారు ఏపీఎంకు ఫిర్యాదు చేశారు.

డిగ్రీ కళాశాలలో ఓపెన్‌హౌస్

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కళాశాలలో అందిస్తున్న వివిధ కోర్సులు, మౌలిక వసతులు, ల్యాబ్‌లు, తరగతి గదులు తదితర అంశాలపై ఇంటర్ విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పి.లత మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలలో అన్ని సదుపాయాలు ఉన్నాయని, విద్యార్థులు డిగ్రీలో చేరాలని కోరారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేపల పెంపకంలో మెలకువలు పాటించాలి

హరిపురం: రిజర్వాయర్లలో చేపల పెంపకం చేసే గిరిజనులు మెలకువలు పాటించాలని మత్స్యశాఖ ఏడీ ప్రసాద్‌నాయక్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎంపీఈడీఏ ఆధ్వర్యంలో రిజర్వాయర్ ఫిషరీస్‌లో బయో సెక్యూరిటీ, వ్యక్తిగత పరిశుభ్రతపై శిక్షణ కార్యక్రమం శుక్రవారం బుడార్సింగి పరిధిలోని కళింగదళ్ రిజర్వాయర్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేపల పెంపకంతోపాటు వేట సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఎగుమతులు, రొయ్య పిల్లలను ఎన్నుకొనే విధానాన్ని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేష్ పాణిగ్రాహి, ఎంపీటీసీ లోకనాథం, అధికారులు బాలాజీ, సునీల్ కుమార్, సత్యనారాయణ, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలి

టెక్కలి: ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగేటప్పుడు ఎక్కువ శాతం మంది మృతి చెందుతున్నారని టెక్కలి సీఐ సూర్య చంద్రమౌళి అన్నారు. శుక్రవారం కోటబొమ్మాళి మండలం కొత్తపేట జంక్షన్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దన్నారు. వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు ఉంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించని 15 మంది వాహనదారులకు జరిమానా విధించారు.

● **పిన్నింటిపేట(పోలాకి):** మోటార్ వాహనదారులు ప్రమాదాల నివారణకు హెల్మెట్ వినియోగం తప్పనిసరని ఎస్ఐ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం పిన్నింటిపేట కూడలిలో అవగాహన కల్పించారు. రోడ్డుప్రమాదాల సమయంలో హెల్మెట్ ప్రాణాపాయం నుంచి తప్పిస్తుందన్నారు. ప్రతీ ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు. బెలమర, పిన్నింటిపేట, ప్రియాగ్రహారం కూడళ్లలో పోలీసులు ప్రయాణికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్యాలు



విద్యార్థినుల డ్యాన్స్ ప్రదర్శన

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం ఫేర్‌వెల్ నిర్వహించారు. విద్యార్థినులు చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తారకేశ్వర పండా, ఎస్ఐ సీహెచ్ రామారావు మాట్లాడుతూ.. ఉన్నతమైన లక్ష్యాలతో విద్యను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా అటల్ ఇన్నోవేషన్ చాలెంజెస్

టెక్కలి: అటల్ ఇన్నోవేషన్ చాలెంజెస్ కార్యక్రమాన్ని శుక్రవారం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించారు. జిల్లాలోని పలు జడ్పీ, ఉన్నత పాఠశాలలతో పాటు, ఏపీఎస్‌డబ్ల్యూ రెసిడెన్షియల్ స్కూళ్లతో పాటు వివిధ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు వివిధ అంశాలపై రూపొందించిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను నిర్వాహకులు అందించారు. ఈ సందర్భంగా ఆదిత్య కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రాజెక్టులు వారి సృజనాత్మకతకు అద్దపడుతున్నాయన్నారు. యూనిసెఫ్, సమగ్ర శిక్ష అభియాన్, ఎస్‌సీఈఆర్టీ, ఆదిత్య, విజ్ఞాన్ సంయుక్తంగా ఈ ప్రదర్శనను నిర్వహించాయి. కార్యక్రమంలో యూనిసెఫ్ రాష్ట్ర ప్రతినిధి టి.సుద ర్శనరావు, జిల్లా సైన్స్ అధికారి కుమారస్వామి, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డి.రఘువీర్, క్లబ్ ఇన్ చార్జ్ వంశీనారాయణ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థినులు

కొత్తమ్మతల్లి హుండీ ఆదాయం రూ.4.67 లక్షలు

టెక్కలి: కోటబొమ్మాళిలోని కొత్తమ్మతల్లి ఆలయ హుండీల ద్వారా 41 రోజులకు గాను రూ.4,67,269 ఆదాయం వచ్చిందని ఈవో వాకచర్ల రాధాకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో దేవదాయశాఖ అసిస్టెంట్ రవికుమార్ ఆధ్వర్యంలో హుండీలను తెరిచి లెక్కించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బోయిన మాధవి, బోయిన కృష్ణారావు, అర్చకులు కమ్మకట్టు అప్పలరాజు, కమ్మకట్టు మాధవరెడ్డి, గ్రామ పెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ ప్రకటించాలి

మెళియాపుట్టి: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మినీ డీఎస్సీ గిరిజన నిరుద్యోగులకు ఉపయోగపడదని, దీనిని రద్దు చేసి మెగా డీఎస్సీ ప్రకటించాలని గిరిజన నిరుద్యోగులు డిమాండ్ చేశారు. హీరాపురం పంచాయతీలో శుక్రవారం ఆదివాసీ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. 2019 ఎన్నికల ప్రచారంలో వైసీపీ ప్రభుత్వం రాగానే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని ప్రకటించిన జగన్.. ఇప్పుడు మరలా ఎన్నికలు వస్తుండడంతో ఉపయోగంలేని డీఎస్సీ ప్రకటించి గిరిజన నిరుద్యోగులను మోసం చేశారన్నారు. ఈ డీఎస్సీలో ఐటీడీఏ పాఠశాలల్లోని ఖాళీలు చూపించలేదన్నారు. అందువల్ల వచ్చే ఎన్నికల్లో ఓట్ల ద్వారా ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు సరవ చొక్కారావు, వరహాల కృష్ణారావు, ఎల్.కిరణ్‌కుమార్, వెంకట్, జగదీష్, పలువురు గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న నిరుద్యోగులు

మొబైల్ వినియోగానికి దూరంగా ఉండాలి

పలాసరూరల్: పలాస మండలం రంగోయి, వజ్రపుకొత్తూరు మండలం గరుడభద్ర గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం మొబైల్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజానాట్యమండలి కళాకారుడు బి.లోకనాథం 'విద్యార్థీ మేలుకో' అనే ఏకపాత్రాభినయంతో మొబైల్ వినియోగంతో జరిగే నష్టాలను వివరించారు. విద్యార్థులు మొబైళ్లకు దూరంగా ఉండాలని, పెద్ద వాహనాలను నడపరాదని, పర్యావరణ పరిరక్షణ కలిగి ఉండాలని అవగాహన కలిగించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఇ.జోగారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

పాతపట్నం: స్థానిక విజ్ఞాన్ స్కూల్ వార్షికోత్సవం శుక్రవారం సందడిగా, ఉత్సాహంగా సాగింది. ప్రిన్సిపాల్ శ్రీధర్ పట్నాయక్ మాట్లాడుతూ.. స్వీయ క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎం.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

హిరమండలం తహసీల్దార్‌గా సుధాకర్

పాతపట్నం: హిరమండలం తహసీల్దార్‌గా బి.సుధాకర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు పనిచేసిన మురళీమోహన్ బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో నాగజ్యోతి నియమితులయ్యారు. అయితే ఈమె ఒక్క రోజు పనిచేసి బదిలీపై వెళ్లడంతో సుధాకర్‌ను నియమించారు. ఈయనకు సిబ్బంది స్వాగతం పలికారు.

క్వారీతో ఇబ్బందులు పడుతున్నాం

● ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామస్థుల స్పష్టీకరణ

పాతపట్నం: మెట్టుపేటకు ఆనుకుని ఉన్న కొండపై క్వారీ వద్దని గ్రామస్థులు అధికారుల ఎదుట స్పష్టం చేశారు. పెద్దమల్లిపురం గ్రామంలో కొయ్యకొండ, మెట్టుపేట, గంగువాడ, చిన్నమల్లిపురం పంచాయతీ ప్రజలతో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ.. మెట్టుపేటకు ఆనుకుని ఉన్న కొండను క్వారీగా మార్చడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి వేళ్లలో భయంకర శబ్దాలతో వస్తుండడంతో భయాందోళన చెందు తున్నామని అలాగే ఏ రాయి ఎప్పుడు ఎలా వచ్చి పడుతుందో తెలియడం లేదని వాపోయారు. ఆ కొండపైనే మా జీవనాధారమని, టేకు, జీడి మామిడి, కొండ చీపురు పంటలు వేసుకుని బతుకుతున్నామన్నారు. క్వారీ ఏర్పాటు వల్ల జీవనాధారం కోల్పోతున్నామన్నారు. క్వారీ వాహనాల వల్ల రోడ్లు పాడవుతున్నాయని, ద్విచక్ర వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంటోందన్నారు. పలువురు ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ.. ఇప్పటికే ఈ క్వారీ వల్ల ఏర్పడిన సమస్యలు పరిష్కరించాలని, భవిష్యత్‌లో క్వారీ నిర్వహణ సాధ్యా సాధ్యాలపై అధ్యయనం చేయాలని కోరారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ రామారావు నాయుడు, డీఆర్వో రామ్మోహనరావు, క్వారీ యాజమాన్య ప్రతినిధి రమేష్, మైన్స్ అధికారులు పాల్గొన్నారు.



ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న ప్రజలు

పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు తప్పనిసరి

● సబ్ కలెక్టర్ నూరుల్ కమర్



నందిగాం: యాప్‌లో వివరాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

నందిగాం: పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలని, ఈ దిశగా చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్, టెక్కలి ఆర్వో నూరుల్ కమర్ అన్నారు. శుక్రవారం పెద్ద తామరాపల్లి, చిన్న తామరాపల్లి, కర్లపూడి, పోతులూరు, నౌగాం, మదనాపురం, కైజోల, హుకుంపేట, సింగుపురం తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఓటర్లకు అవసరమైన తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంప్‌లు తదితర ఏర్పాట్లపై నిశితంగా పరిశీలించారు. ప్రతి కేంద్రంలో సదుపాయాలపై ఎప్పటికప్పుడు వివరాలు అందించాలని సూచించారు. ఆయనతో పాటు తహసీల్దార్ వి.పద్మావతి ఉన్నారు.

బీఎల్వోలు అప్రమత్తంగా ఉండాలి

నరసన్నపేట/జలుమూరు: బూత్ లెవల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని నరసన్న పేట ఆర్వో జేవీఎస్ఎస్ రామ్మోహన్ రావు అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులు, బీఎల్వోలతో వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాల్లో ఉన్న తప్పులను గుర్తించి వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. ఏ రాజకీయ పార్టీకి కొమ్ము కాయకుండా విధులు నిర్వహించాలన్నారు. బాధ్యతలు విస్మరిస్తే చర్యలు తప్పవని బీఎల్వోలకు హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కనకరావు తదితరులు పాల్గొన్నారు. జలుమూరు తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలతో సమావేశం నిర్వహించి సూచనలిచ్చారు.



జలుమూరులో మాట్లాడుతున్న ఆర్వో రామ్మోహన్‌రావు

ఆహార భద్రతా చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలి

జలుమూరు: ఆహార భద్రతా చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని రాష్ట్ర కమిషన్ సభ్యుడు బి.కాంతారావు అన్నారు. ఈ చట్టం అమలు తీరును శుక్రవారం జలుమూరు కేజీబీవీ పాఠశాలలో పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఆహారపదార్థాలు రుచిగా ఉండేలా చూడాలన్నారు. స్టాక్ రిజిస్టర్‌ను సక్రమంగా నిర్వహించాలన్నారు. సాంబారు గంజిలా కాకుండా రుచిగా తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్‌వో శ్రీనివాసరావు, ఆహారభద్రత జిల్లా అధికారి జి.శ్రీరాములు, తూనికలు, కొలతల శాఖాధికారి రాజారమేష్, ఎంఈవోలు మాధవరావు, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ఏఐ సిబ్బంది రక్తదానం



రక్తదానం చేస్తున్న టోల్‌ప్లాజా సిబ్బంది

పలాసరూరల్: ఎన్‌హెచ్ఏఐ రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమంలో భాగంగా లక్ష్మీపురం టోల్ గేట్ వద్ద శుక్రవారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో టోల్‌ప్లాజా సిబ్బంది రక్తదానం చేశారు. రక్తదానంపై అవగాహన కలిగించేందుకు ప్రతి ఏటా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా 53 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వలంటీర్లు చైతన్య, ఆర్ఈ నాగేశ్వరరావు, టోల్‌ప్లాజా ప్రాజెక్టు మేనేజర్లు సెంథిల్‌కుమార్, వీవీకేవీప్రసాద్, సేఫ్టీ మేనేజర్ కిరణ్‌కుమార్, మోహనరావు, ధనరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

పాతపట్నం: దేవాలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సీఐ ఎన్. సాయి అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో దేవాలయాల అర్చకులు, ధర్మకర్తలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో ఆలయాల్లో చోరీలు అధికంగా జరుగు తున్నందున వాటి నియంత్రణకు సహకరించాలన్నారు. ఆలయాల్లో బంగారు, వెండి, నగదు ఉంచవద్దన్నారు. అనుమానితులు ఎవరైనా తారసపడితే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు.

మహాలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు

నరసన్నపేట: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో పుష్యబహుళ అమావాస్యను పురస్కరించుకుని టీటీడీ ఆధ్వర్యంలో శుక్రవారం మహాలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక కుంకు మార్చన నిర్వహించారు. అర్చకులు కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొని కుంకుమ పూజలు చేశారు.





కొత్తూరు: బాబుష్యూరిటీలో పాల్గొన్న కలమట సాగర్..



వజ్రపుకొత్తూరు: పెద్దబొడ్డపాడులో పల్లెపల్లెకు టీడీపీలో పాల్గొన్న నాయకులు



టెక్కలి: గ్రామస్థులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలి

కొత్తూరు: రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని, దీనికి చరమగీతం పాడి టీడీపీని గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ నిర్వహిం చారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై రూపొం దించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **వజ్రపుకొత్తూరు:** వైసీపీ పాలనలో ప్రజలు విసుగు చెందారని టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు అన్నారు. శుక్రవారం పెద్దబొడ్డ పాడులో పల్లెపల్లెకు టీడీపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి మినీ మేనిఫెస్టో కరపత్రాలు అందించి అవగాహన కలిగించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రంలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. నాయకులు అర్సవెల్లి ఉమా మహేశ్వరరావు, బుల్లోజు శశిభూషణ్, కణితి సురేష్, పోతనపల్లి సాంబమూర్తి, మరడ దుర్యోధనరెడ్డి, దుంపల ప్రకాష్, దుంపల వల్లభరావు, ముఖలింగం, రంగారావు, ఉప్పాడ కృష్ణ, మణిగాం తాతయ్య, సూర్యనారాయణ పాల్గొన్నారు.



పొందూరు: లైదాంలో టీడీపీ నాయకులు..

● **టెక్కలి:** రాష్ట్రంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాలకు ఒరిగిందేమీలేదని, రానున్న ఎన్నికల్లో ఆ పార్టీని సాగనంపు దామని టీడీపీ కోటబొమ్మాళి మండల అధ్యక్షుడు బోయిన రమేష్, పీఏసీ ఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరి వరప్రసాద్ అన్నారు. శుక్రవారం కోటబొమ్మాళి మండలం అక్కయ్యవలస, తదితర గ్రామాల్లో పర్యటించి టీడీపీ మేని ఫెస్టోపై ప్రజలకు అవగాహన కలిగించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి సహక రించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు వెలమల విజయలక్ష్మి, తర్ర రామకృష్ణ పూజారి శైలజ, బాడాన రమణమ్మ, వాన లక్ష్మి, దేవాది సింహాద్రి, టి.నర్సింగరావు, నంబాళ్ల శ్రీనివాస్, కర్రి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

● **పాతపట్నం:** టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైల లక్ష్మయ్య అన్నారు. సింగుపురం పంచాయతీ దేవుదళ, కొంచాడపేట గ్రామాల్లో శుక్రవారం బాబు ష్యూరిటీ భవి ష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ రూపొందించిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు బెజ్జిపల్లి శివాజీ, నాయకులు యెన్ని రాఘవ, కోనారి కృష్ణారావు, షన్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.



పాతపట్నం: దేవుదళలో కరపత్రాలు అందిస్తున్న టీడీపీ నేతలు

● **పొందూరు:** టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్ అన్నారు. లైదాం, లోలుగు తదితర గ్రామాల్లో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ నిర్వహించారు. మండల తెలుగుయువత ప్రధాన కార్యదర్శి శంకరభాస్కర్, లోలుగు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

ఆమదాలవలస: ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని చింతాడ గ్రామానికి చెందిన తోట శ్రీనివాసరావు అనే పెయింటర్ ప్రమాదవశాత్తూ మృతి చెందినట్టు స్థానిక ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీనివాసరావు ఈ నెల 4న పట్టణంలోని పూజారిపేటకు చెందిన ఒకరి ఇంటి మేడ పైన పెయింటింగ్ వర్క్ చేస్తూ ప్రమాదవశాత్తూ జారిపడి తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే అతడిని రాగోలు జెమ్స్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. శ్రీనివాసరావు భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. అలాగే తొగరాం గ్రామానికి చెందిన తమ్మినేని అప్పలరాజు(45) అనే భవన నిర్మాణ కార్మికుడు గురువారం హైదరాబాద్‌లో పనులు నిర్వహిస్తూ మూడో అంతస్తు నుంచి కింద పడిపోయాడు. అతడు చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కుటుంబ సభ్యులకు శుక్రవారం సమాచారం అందింది. అప్పలరాజుకు భార్య భారతితో పాటు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

వలసవెళ్లిన మత్స్యకారుడు..



కృష్ణ (ఫైల్)

రణస్థలం: వలసవెళ్లిన మత్స్యకారుడు మృతి చెందాడు. గ్రామ పెద్ద పిల్ల తాత చెప్పిన వివరాల మేరకు ఎన్‌జీఆర్ పంచాయతీ గుర్యపేట గ్రామానికి చెందిన చీకటి కృష్ణ (31) గుజరాత్‌లోని హీరావాల్ తీరంలో చేపల వేట కోసం శుక్రవారం తెల్లవారి జామున వెళ్లగా, సముద్రంలో జరిగిన బోటు ప్రమాదంలో మృతి చెందాడు. అయితే ఆ ప్రమాదం ఎలా జరిగిందో తెలియాల్సి ఉంది. మృతి చెందిన కృష్ణకు భార్య లక్ష్మి, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు.

వైసీపీ నేత జరుగుళ్ల శంకర్‌పై దాడి



గాయపడిన శంకరరావు

శ్రీకాకుళం క్రైమ్: ఎచ్చెర్ల గ్రామానికి చెందిన వైసీపీ నేత, మాజీ సర్పంచ్ జరుగుళ్ల శంకరరావుపై శుక్రవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. ఎచ్చెర్ల ఎస్ఐ చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం... శంకరరావు ఎస్ఎం పురం రోడ్‌లోని తన పొలంలో నిర్మాణ పనులు జరుగుతుండగా.. సాయంత్రం 6 గంటలు దాటిన తర్వాత ఇంటికి మోటారు బైక్‌పై తిరిగి వెళ్తుండగా వెనుక నుంచి గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు మోటారు బైక్‌పై వచ్చి దాడికి పాల్పడ్డాడు. గుర్తు తెలియని ఆ ఇద్దరు వ్యక్తులు ముఖానికి మాస్క్‌లు ధరించి ఆయుధాలతో దాడికి పాల్పడ్డారు. ఈ సమయంలో శంకరరావుతో పాటు అదే గ్రామానికి చెందిన మురళి కూడా ఉన్నాడు. ఈ దాడిలో శంకరరావుకు ముఖానికి తీవ్ర గాయాలు కాగా.. బైక్ నడుపుతున్న మురళి దీనిని గమనించి వాహనాన్ని ఆపకుండా వేగంగా పోనివ్వడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గాయపడిన శంకరరావును శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లి.. కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. జేఆర్ పురం సీఐ రామచంద్రరావు, ఎస్ఐ చిరంజీవి శ్రీకాకుళంలోని ప్రైవేటు ఆసుపత్రికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా రాజకీయ కక్షతోనే తన భర్తపై దాడి జరిగిందని విజయ ఆరోపించారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన ద్విచక్రవాహనం

పలాస: కంబిరిగాం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి సమీపంలోకి పొలాల్లోకి దూసుకువెళ్లింది. ఈ ఘటనలో నారాయణపురం గ్రామానికి చెందిన పిట్ట మాధవరావు, పిట్ట మోహనరావులకు తీవ్ర గాయాలయ్యాయి. స్వగ్రామం నుంచి పలాస వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. 108 వాహనంలో పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ సిలిండర్ లీక్.. వ్యాపించిన మంటలు

పొందూరు: మండల కేంద్రంలో శుక్రవారం గ్యాస్‌సిలిండర్ లీక్ కావడంతో మంటలు చెలరేగి ప్రమాదం చోటుచేసుకుంది. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఎంఎస్ఎన్ కాంప్లెక్స్‌లో సాయంత్రం అనకాపల్లి శ్రీనివాసరావు ఇంటిలో వంట చేస్తున్న సమయంలో గ్యాస్ లీక్‌కావడంతో మంటలు చెలరేగాయి. దీంతో వంటగదితో పాటు ఇంటిలో ఉన్న సోఫా ఇతర వస్తువులకు మంటలు అంటుకున్నాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

ల్యాండ్ టైటిల్లింగ్ యాక్ట్‌పై రిట్ పిటిషన్

అరసవల్లి: ల్యాండ్ టైటిల్లింగ్ యాక్ట్‌పై రిట్ పిటీషన్ దాఖలు చేశామని జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు అన్నారు. అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో సభ్యులందరూ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ఈ చట్టానికి వ్యతిరేకంగా అన్ని బార్ అసోసియేషన్ న్యాయవాదులు పెద్ద సంఖ్యలో నిరసనలు, హర్తాళ్‌లు, సమ్మెలు, నిరాహార దీక్షలు, ఆమరణ నిరాహార దీక్షలతో ప్రభుత్వానికి దీనిని పూర్తిగా రద్దు చేయాలని కోరామన్నారు. ఈ చట్టం ద్వారా సామాన్యులకు తీవ్రస్థాయిలో నష్టం వాటిల్లుతుందన్నారు. ఈ చట్టం రద్దు జరిగేంతవరకు పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు.

పరిశోధనలకు ప్రాధాన్యం కల్పించాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ తదితరులు

ఎచ్చెర్ల: సమాజానికి ఉపయోగపడేలా పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ కేఆర్ రజని అన్నారు. వర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రాజశేఖరరావు రాసిన ఎంబెడెడ్ సిస్టమ్ విత్ మైక్రో కంట్రోలర్స్ అనే పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. అధ్యాపకులు, విద్యార్థులు ఆ దిశగా దృష్టి సారించాలన్నారు. వర్సిటీలోని ప్రతి విభాగంలో అధ్యాపకులు బోధనకే పరిమితం కాకుండా పరిశోధనలకు, జర్నల్స్ ప్రచురణ, నూతన ఆవిష్కరణల్లో తమ వంతు భాగస్వామ్యం ఉండాలన్నారు. అప్పుడే సమకాలీన అంశాలపై అవగాహన కల్పించగలమన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ బిడ్డిక అడ్డయ్య తదితరులు చెప్పారు.

పిల్లలందరికీ డీ-వార్మింగ్ మాత్రలు వేయించాలి



పిల్లలకు మాత్రలు వేస్తున్న కలెక్టర్

కలెక్టరేట్: పిల్లలందరికి డీ వార్మింగ్ మాత్రలు వేయాలని కలెక్టర్ మంజీర్ జిలానీ సమూన్ పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 2-19 సంవత్సరాల మధ్య వయసు గల పిల్లలందరూ ఒక ఆల్‌బెండజోల్ మాత్రను వేసుకోవాలని చెప్పారు. ఈ మాత్ర వల్ల ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. జిల్లాలో ఉన్న 4,64000 మంది పిల్లలు ఈ మాత్రలను వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, జిల్లా కోఆర్డినేటర్ సీపీ శ్రీదేవి, మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, డిప్యూటీ డీఈవో విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

● **గార:** నులి పురుగులు దినోత్సవం సందర్భంగా శుక్రవారం శ్రీకూర్మం, గార పీహెచ్‌సీల పరిధిలో 2 నుంచి 19 సంవత్సరాలు వయస్సు కలిగిన వారికి డీ-వార్మింగ్ మాత్రలు పంపిణీ చేశారు. శ్రీకూర్మం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.మనోజ్ బాబు ఆధ్వర్యంలో 6,316 మందికి ఈ మాత్రలు వేయించారు.

కొనసాగుతున్న భాగవత సప్తాహం



భాగవత సప్తాహం నిర్వహిస్తున్న వేదపండితులు

శ్రీకాకుళం అర్బన్: పొన్నాం గ్రామంలో ఉన్న కేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో గత వారం రోజులుగా శ్రీమద్ భాగవత సప్తాహం వైభవంగా కొనసాగుతుంది. శుక్రవారం ఆలయ అర్చకులు మహీంద్రాడ నారాయణాచార్యులు పర్యవేక్షణలో భాస్కరభట్ల శ్రీరామశర్మ, శృంగారం లక్ష్మీ ధనుంజయశర్మతోపాటు పది మంది రుత్వికులు పారాయణాలు, విశేష హోమాలు, ఆధ్యాత్మిక ఉపన్యాశాలు చేశారు. లోక కల్యాణార్థం ఈ నెల 4 నుంచి ప్రారంభించిన హోమాలు శనివారంతో ముగుస్తాయని తెలిపారు.

సంఘాల బలోపేతానికి కృషిచేయాలి

జి.సిగడాం: రుణాలు తిరిగి చెల్లింపులు సక్రంగా జరిగేలా చూడాలని, గ్రామ స్థాయిలో స్వయంశక్తి సంఘాల బలోపేతానికి కృషి చేయాలని ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు అన్నారు. శుక్రవారం నాగులవలస, వీఆర్ పేట గ్రామాల్లో స్వయంశక్తి సంఘాలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంక్‌లు, స్త్రీనిధి ద్వారా తీసుకున్న రుణాల తిరుగు చెల్లింపులు బాధ్యత సీసీలు, వీవోఏ చూడాలన్నారు. గ్రామాల్లో తరచూ సంఘాల సభ్యులతో సమావేశాలు ఏర్పాటు చేసుకొని చర్చించుకోవాలన్నారు. పొదుపును నెలవారి క్రమం తప్పకుండా కట్టాలన్నారు. రికార్డులను సక్రంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో సీసీ కృష్ణవేణి, వీవోఏ ధనలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

జర్నలిజం విద్యార్థుల మీడియా టూర్



విశాఖ ఆకాశవాణి కేంద్రం వద్ద జర్నలిజం అధ్యాపకులు, విద్యార్థులు

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలోని జర్నలిజం విభాగం విద్యార్థులు అకడమిక్‌లో భాగంగా మీడియా టూర్ నిర్వహించారు. విశాఖలోని ఆకాశవాణి కేంద్రం, ఎలక్ట్రానిక్ మీడియా కేంద్రాలను శుక్రవారం సందర్శించారు. బ్రాడ్ కాస్టింగ్, టెలీ కాస్టింగ్ ప్రింట్ ప్రాసెసింగ్, న్యూస్, టెక్నికల్ విభాగాలు తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో వర్సిటీ జర్నలిజం అసిస్టెంట్ ప్రొఫెసర్స్ ఆర్.తిరుపతిరావు, జి.లీలావరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర ప్రగతి

అరసవల్లి: అప్పులు చేయకుండా సంపదను సృష్టించడం ద్వారా సంక్షేమ పథకాలను అమలు చేయగల సమర్థుడు చంద్రబాబు అని, అభివృద్ధికి చిరునామా అని జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో అయన విలేకరులతో మాట్లాడారు. 'బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ' ద్వారా అందరి సంక్షేమం కోసం పూర్తి బాధ్యత తీసుకునే వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. ఇప్పటికే దానికి సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవడం జరిగిందని, టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించిన సంక్షేమ పథకాలను అమలు చేసి తీరతామన్నారు. జిల్లాలో నదుల అనుసంధానం చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. సమావేశంలో రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి సింతు సుధాకర్, ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడు ప్రధాన విజయరాం పాల్గొన్నారు.

'కిలోమీటరు రోడ్డు కూడా వేయలేని దుస్థితి'

కవిటి: గ్రామాల్లో కిలోమీటరు రోడ్డు వేయలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు అన్నారు. నెలవంక పంచాయతీ కొమ్ముపుట్టుగ గ్రామానికున్న రోడ్డును శుక్రవారం పరిశీలించారు. గ్రామానికి మెయిన్ రోడ్డు నుంచి వచ్చే రోడ్డును మెరుగుపర్చుకోలేని పాలకులు తయారైనాయన్నారు. గ్రామస్థులు ఈ రోడ్డుపై ప్రయాణిస్తూ ఇబ్బందులు పడుతూ, మెరుగుపర్చుకోవటానికి చందాలు వేసుకుంటున్న విషయాన్ని తెలుసుకొని పరిశీలనకు వచ్చినట్టు రాజు తెలిపారు. రోడ్డు నిర్మాణానికి అవసరమైన కంకర వేయిస్తానని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికలలో జనసేన-టీడీపీ కూటమికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు డి.దివాకర్, హేమచలపతి, మధు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి



మాట్లాడుతున్న న్యాయాధికారి

గార: సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి రెడ్డి సన్యాసినాయుడు అన్నారు. శుక్రవారం ఆయన అంపోలు సమీపంలోని జిల్లా జైలును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు పొందవచ్చని అన్నారు. ఖైదీలకు అందుతున్న సౌకర్యాలు గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లా జైల్ సూపరింటెండెంట్ ఎస్.నబీఖాన్ తదతరులు పాల్గొన్నారు.

దిగదుడుపు పెన్షన్‌తో బతికేదెలా?



మాట్లాడుతున్న ఆదినారాయణమూర్తి

అరసవల్లి: దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 75 లక్షల ఈపీఎఫ్ పెన్షన్‌దారులు దయనీయ స్థితిలో ఉన్నారని, వీరిలో సుమారు 80 శాతం మందికి పెన్షన్ రూ.2000 లోపు కాగా, రూ.వెయి కూడా దాటనివారు లక్షల సంఖ్యలో ఉన్నారని సంఘ అధ్యక్ష, కార్యదర్శులు డి.పార్వతీశం, ఆదినారాయణ మూర్తి అన్నారు. స్థానిక జ్యోతిరావు పూలే పార్కు వద్ద ఈపీఎస్ పెన్షనర్లు చేస్తున్న 5వ రోజు నిరాహారదీక్ష శిబిరం వద్ద మాట్లాడుతూ.. దిగదుడుపు పెన్షన్‌తో వీరంతా బతికేదెలా అని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ నాయకుడు కె.శ్రీనివాసు మాట్లాడుతూ.. తీవ్ర అసంతృప్తి, ఆర్థిక ఇబ్బందుల ఉన్న ఈపీఎస్ పెన్షన్‌దారుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ జిల్లా నాయకులు భాస్కరరావు, బి.జనార్ధనరావు పాల్గొన్నారు. నిరాహార దీక్షలో జి.రాజారావు, వి.ప్రసాద్, పి.గోపాలరావు, అప్పారావు, కె.వేణుగోపాల్ పాల్గొన్నారు.

టీడీపీ ఫ్లెక్సీ చింపివేసిన దుండగలు



మెట్టక్కివలసలో చించివేసిన టీడీపీ ఫ్లెక్సీ

ఆమదాలవలస: స్థానిక మున్సిపాలిటీ పదో వార్డు హడ్కో కాలనీలో టీడీపీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీను గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చించివేయడంపై టీడీపీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మెట్టక్కివలస టీడీపీ నాయకులు నాగల మురళీధర్ ఆధ్వర్యంలో ఎస్ఐకు ఘటన వివరాలను వివరించారు. ఎస్ఐ స్పందిస్తూ ఎన్నికల నేపథ్యంలో ఇలాంటి పనులు చేస్తున్న వారిపై కఠినంగా శిక్షిస్తామన్నారు. ఎస్ఐకు ఫిర్యాదు చేసిన వారిలో కారుణ్య ధర్మారావు, గొండు కరుణాకర్, రాచకొండ రాజు, మండల జగన్నాథం, కట్టుమురి చిన్నారావు, బోసు భాస్కర్, రమేష్, సీతారాం ఉన్నారు.

తెలగ కులస్థులను బీసీలో చేర్చాలి

రణస్థలం: తెలగ కులస్థులను బీసీలో చేర్పించాలని ఆ సంఘ నాయకుడు పి.వెంకట రామారావు డిమాండ్ చేశాడు. తెలగ సామాజిక వర్గానికి రిజర్వేషన్ లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారని అన్నారు. బీసీ జాబితాలో చేర్పించాలని కోరుతూ గత నెల 28వ తేదీన ఇచ్ఛాపురం నుంచి పాదయాత్ర చేపట్టామన్నారు. శుక్రవారం జేఆర్ పురం వద్ద తెలగ కులసంఘం నాయకులు పైడి శ్రీనివాసరావు, పైడి అప్పడదొర, లంకలపల్లి రామారావు, సివిల్ ప్రసాద్, రాయిపురెడ్డి బుజంగరావు, పులప నరసయ్య ఆయనకు స్వాగతం పలికి పాదయాత్రలో పాల్గొన్నారు.

● **లావేరు:** ఉత్తరాంధ్ర జిల్లాలోని తెలగ కులాస్థులను బీసీ జాబితాలో చేర్చాలని ఉత్తరాంధ్ర తెలగ సంఘ నాయుకులు పల్లంట్ల వెంకటరామారావు అన్నారు. తెలగ సామాజిక వర్గాన్ని బీసీ జాబితాలోకి చేర్చాలని కోరుతూ ఆయన ఇచ్ఛాపురం నుంచి పాయకరావుపేట వరకు చేపట్టిన పాదయాత్ర శుక్రవారం లావేరుకు చేరుకుంది. ఈ పాదయాత్ర లావేరు, బొడ్డపాడు, గురుగుబిల్లి, సుభద్రాపురం, తాళ్లవలస, రావివలస మీదుగా సాగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ తోటయ్యదొర, తెలగ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

శ్రీకాకుళం స్పోర్ట్స్: జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ జూనియర్ చాంపియన్‌షిప్ పోటీలకు కేశవరావుపేటకు చెందిన సనపల జగదీశ్వరరావు, గురుగుబిల్లి దుర్గాప్రశాంతి ఎంపికైనట్టు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు కలిదిండి నరసింహారాజు, కార్యదర్శి సిగిలిపల్లి లక్ష్మీదేవి తెలిపారు. వీరిద్దరు బిహార్ రాష్ట్రం పట్నాలో ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు జరగనున్న చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారన్నారు. ఇందుకు సంబంధించి కోచింగ్ క్యాంపును ఈ నెల 10వ తేదీ నుంచి అనంతపురంలో జరుగుతుందన్నారు. వీరిని ఆ సంఘ చైర్మన్ బడగల హరనాథరావు, కన్వీనర్ కె.వెంకట రామరాజు, ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణదాస్, కార్యదర్శి పి.సాంబమూర్తి తదితరులు అభినందించారు.

తహసీల్దార్‌గా ఉమామహేశ్వరరావు

జి.సిగడాం: జి.సిగడాం తహసీల్దార్‌గా ఉమామహేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. విజయనగరం కలెక్టరేట్‌లో ఏవోగా విధులు నిర్వర్తించిన ఈయన పదోన్నతిపై తహసీల్దార్‌గా వచ్చారు. ఇటీవల అనకాపల్లి నుంచి బదిలీపై వచ్చిన తహసీల్దార్ రవికుమార్ వేరోచోటకి బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యలు చేపట్టిన ఉమామహేశ్వరరావును సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బీఎల్‌వోల సమావేశంలో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలు దృష్ట్యా పోలింగ్ కేంద్రాలు వద్ద మౌలిక వసతులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో వచ్చిన ఫారం-6, 7, 8లను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. సమావేశంలో డీటీ నిర్మల, ఆర్ఐ రామచంద్రరావు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం



స్వామివారి విగ్రహంతో తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని స్థానిక విశాఖ-బీ కాలనీలో ఉన్న షిర్డీసాయి మందిర ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు మధు విలేకర్ మాట్లాడుతూ.. కమిటీ సభ్యులు అందరి సహకారంతో ఎంతో ప్రగతి సాధించామన్నారు. మందిరంలోని యోగా హాల్‌లో రెండు పూటలా యోగా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిరోజూ సాయంత్రం లలితా, విష్ణు సహస్రనామ పారాయణం జరుగుతున్నాయన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో మంది అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారు. విశాఖ-బీ కాలనీ కన్వీనర్ కొంక్యాన మురళీధర్ మందిరంలో నిర్వహించే ప్రతి కార్యక్రమానికి తమ వంతు ప్రోత్సాహం అందిచడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సభ్యులు పూర్ణ శశి, పైడి రాజ్యలక్ష్మి, సత్యవతి, ఆలయ కమిటీ మేనేజర్ గోపాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు. అరసవల్లిలో ఉన్న షిర్డీ సాయి ఆలయ ప్రథమ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించారు. కాగడ హారతి, పాలాభిషేకం, హోమ పూజలు చేపట్టారు. సప్త అశ్వరథం పై ఊరేగించారు.

ప్రజల్లోకి కేంద్ర ప్రభుత్వ పథకాలు

రణస్థలం: నిరుపేదల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్టు బీజేపీ విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్‌కుమార్ అన్నారు. శుక్రవారం రాత్రి కొండములగాం గ్రామంలో 'పల్లె పల్లెకు బీజేపీ.. ఇంటింటికీ కమలం' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. పార్టీ నాయకులు కాయక రమణ, కొంచాడ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధానికి భారతరత్నపై హర్షం

సరుబుజ్జిలి: భారత మాజీ ప్రధాన మంత్రి, దివంగత పీవీ నరసింహారావుకి కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రకటించడంపై అభ్యుదయ రచయితల సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ సంఘ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కేవీ రాజారావు, ఎం.రామకృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తెలుగు ఖ్యాతిని ఇనుమడింప చేశారని ఆయనకు భారతరత్నకు ఎంపిక చేయడం తెలుగుజాతికి దక్కిన గౌరవంగా భావిస్తున్నట్టు పేర్కొన్నారు.

● **శ్రీకాకుళం కల్చరల్:** మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకి కేంద్ర ప్రభుత్వం భారతరత్న ఇచ్చి తెలుగువాడికి సముచిత న్యాయం కల్పించారని బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. పన్నాల నరసింహమూర్తి, గుమ్మా నగేష్, హరి శర్మ, ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ, ఆరవెల్లి శ్రీరామ శర్మ, భాస్కరభట్ల శ్రీరామ శర్మ, తెన్నేటి సునీల్ తదితరులు ఉన్నారు.

పోస్టల్ బ్యాలెట్ సరి చూసుకోవాలి

కలెక్టరేట్: పోస్టల్ బ్యాలెట్‌పై ఉన్న డిక్లరేషన్, సంబంధిత ఫారాలన్నీ సరిగ్గా చూసుకోవాలని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు అన్నారు. సర్వీసు ఓటర్లు, డ్యూటీ చేసే వారి ఓట్లు అనేవి రెండు రకాలుగా ఉంటాయని, పోస్టల్ బ్యాలెట్‌కు అవసరమైన పేపర్లు జతచేయాలని వివరించారు. స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మాస్టర్ ట్రైనర్స్ చిట్టిరాజుతో కలిసి మెప్మా పీడీ కిరణ్‌కుమార్, గార మండలం ఉప్పరవానిపేట పాఠశాల హెచ్‌ఎం శేషగిరిరావు పాల్గొని వివిధ అంశాలను వివరించారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి

అరసవల్లి: టీడీపీ అధినేత చంద్రబాబు నేతృత్వంలోనే రాష్ట్రంలో నిజమైన అభివృద్ధి సాధిస్తుందని మాజీ మంత్రి, టీడీపీ నాయకుడు గుండ అప్పలసూర్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. భారతీయత అంటే మతం కాదని ఉన్నత జీవన విధానమని, సత్యం, ధర్మం, న్యాయం ఆలంబనగా పరిస్థితులు గతంలో ఉండేవన్నారు. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో పరిస్థితిని చూస్తే అవేవీ కానరావడం లేదన్నారు. ప్రజల జీవన విధానంలో అభివృద్ధితో పాటు వెలుగులు ఎలా నింపాలో చంద్రబాబుకు తెలుసని అన్నారు. ఐటీడీపీ అధ్యక్షుడు ప్రధాన విజయరాం ఉన్నారు.

పోటీతత్వంతోనే క్రీడల్లో రాణింపు

శ్రీకాకుళం స్పోర్ట్స్: పోటీతత్వంతోనే క్రీడల్లో రాణించవచ్చునని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శుక్రవారం పాత్రునివలస స్టేడియంలో జరిగిన 14వ రాష్ట్ర స్థాయి జూనియర్ మహిళల హాకీ చాంపియన్‌షిప్ ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా హాకీ సంఘం అధ్యక్షుడు గుమ్మా నగేష్, గొండు కృష్ణమూర్తి, టి.వెంకట విజయలక్ష్మి, ఎంవీ రమణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.రమణమూర్తి, ఎం.వాసుదేవాచారి, కార్యదర్శి మధు, అనిల్‌కుమార్, బాలు, జడ్పీటీసీ రుప్ప దివ్యశ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు ఘనంగా వీడ్కోలు

సరుబుజ్జిలి: అనకాపల్లి బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో పీవీవీ మురళీమోహన్ కుమార్‌కు శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఎంపీడీవో కార్యాలయంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు సత్యనారాయణ, జడ్పీటీసీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మురళీమోహన్‌ను ఎంపీడీవోగా తాను విధులు నిర్వహించిన సమయంలో సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు గోవింద వెంకట శివానందమూర్తి, లావేటి అనిల్‌కుమార్, తహసీల్దార్ శ్యాంకుమార్, ఎస్ఐ నిహార్ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో జాగ్రత్త వహించాలి

సోంపేట: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జాగురతతో వ్యవహరించాలని తహసీల్దార్ కె.విజయ్‌కుమార్ కోరారు. కార్యాలయంలో ఎన్నికల విధుల అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఇచ్ఛాపురం: పురుషోత్తపురం నుంచి కేదారిపురం మీదుగా ముచ్చింద్ర వరకు రోడ్డు నిర్మాణానికి రూ.80 లక్షల ఎస్ఆర్ నిధులతో శంకుస్థాపన చేశారు. అనంతరం కేదారిపురంలో ఉపాధి పథకం నిధులతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాన్ని జడ్పీ చైర్‌పర్సన్ పి.విజయ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సాయిరాజు, ఎంపీపీలు బోర పుష్ప, పి.దేవదాసు రెడ్డి, జడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, వైఎస్ ఎంపీపీలు దున్న గురుమూర్తి, డి.వివేకానంద్ రెడ్డి, చాట్ల తులసీదాస్ రెడ్డి, సర్పంచ్ నీలాపు సారధి రెడ్డి, ఎంపీటీసీ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి

పొందూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన పారిశ్రామిక సమ్మెను, గ్రామీణ భారత్ బంద్‌లను విజయవంతం చేయాలని ప్రజా సంఘాల నాయకులు తాండ్ర ప్రకాష్, సన్నశెట్టి రాజశేఖర్, డి.గణేష్ తదితరులు కోరారు. వావిలపల్లిపేట కూడలిలో కార్మికులతో భారత్ బంద్‌పై ప్రచారం నిర్వహించారు. ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

కంచిలి: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని ప్రిన్సిపాల్ పైల రజని అన్నారు. శుక్రవారం కంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫేర్వెల్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రమశిక్షణతో విద్యను అభ్యసించడం వల్ల ఉన్నత శిఖరాలు చేరుకుంటారని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధితోనే దేశాభివృద్ధి

జి.సిగడాం: గ్రామాల అభివృద్ధి చెందితే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ మండల అధ్యక్షుడు, విశ్వకర్మ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ వజ్జపర్తి రఘురాం అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు శుక్రవారం పాలఖండ్యాం, సంతవురిటి గ్రామాల్లో పల్లెకుపోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీతోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం అన్నారు. పాలఖండ్యాంలో రాత్రి బస చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మీసాల రామకృష్ణ, నాయకులు పొగిరి నారాయణరావు, అలుగోలు లక్ష్మీనారాయణ, పొగిరి దాశరథి, పాండూరి అప్పారావు, జి.అప్పలరాజు, ఎం.పోలారావు తదితరులు పాల్గొన్నారు